

సత్తెమ్మ, అంకమ్మలకు సారె

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ పరిధి యర్రబాలెంలో సత్తెమ్మ, అంకమ్మ తల్లులకు ఆదివారం సారె సమర్పించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్య అన్నదానానికి గుంటూరు వాసి ఎల్. వెంకట సాయికృష్ణ రూ.51,116 విరాళమిచ్చారు.



కాళికాదేవి అమ్మవారికి బోనాలు

మాచవరం: మండలంలోని పిన్నెల్లి గ్రామ దేవత కాళికాదేవి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

వినియోగదారుల హక్కుల పరిరక్షణ కార్యాలయం ప్రారంభం




తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని ఎస్ఎస్ఆర్ ప్లాజాలో జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం కార్యాలయాన్ని ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు కూడారి తిరుపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుడి ఇబ్బందులు, సమస్యలకు పరిష్కారం, హక్కులపై ఫోరం అవగాహన కల్పిస్తోందని తెలిపారు. మంగళగిరిలో నూతనంగా ప్రారంభించిన జిల్లా కార్యాలయంలో కూడా వినియోగదారులు జరిగిన నష్టంపై ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షులు బొమ్ము జస్వంత్‌రెడ్డి, జిల్లా యూత్ విభాగం అధ్యక్షులు టి. రవికుమార్, ఫోరం జిల్లా మహిళా విభాగం అధ్యక్షరాలు ప్రియారెడ్డి, యూత్ జిల్లా ఇన్‌చార్జి షేక్ రిజ్వాన్, యూత్ వింగ్ ప్రతినిధి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

యోగాలో లిమిట్‌లెస్ సెంటర్ విద్యార్థులకు పతకాలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అమరావతి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని సుమేధా స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించారని యోగా టీచర్ వంగా వెంకటేష్ తెలిపారు. 10–14 వయస్సు విభాగంలో గోహితకు కాంస్యం, 18–28 విభాగంలో పి.భార్గవికి బంగారు, కాంస్యం, 28–35 విభాగంలో వి.వెంకటేష్‌కు రెండు బంగారు, 35–45 విభాగంలో రేణుక రెండు బంగారు పతకాలు సాధించారన్నారు. నిత్యం యోగాసనాలతోపాటు ఆహార అలవాట్లు మార్పు చేసుకుంటే చక్కని ఆరోగ్యం సొంతమని వెంకటేష్ తెలిపారు. విజేతలకు, పోటీల్లో పాల్గొన్న వారికి లిమిటెస్ ఫిట్‌నెస్ సెంటర్ అధినేత నీలిమ అభినందనలు తెలిపారు.

వైభవంగా గిరిజా కల్యాణం



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం గిరిజా కల్యాణం వైభవంగా నిర్వహించారు. వామనాశ్రమ స్వామిజీ మాట్లాడుతూ గిరిజా కల్యాణం నిర్వహించడం వల్ల వివాహ దోషాలు తొలగిపోతాయని అన్నారు. త్వరగా పెళ్లిళ్లు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఆది దంపతులు పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహంతో త్వరగా పెళ్లిళ్లు కావాలని ఆశీర్వదించారు. గిరిజా కల్యాణాన్ని వేద పండితులు (కాళహస్తి) శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం 200 మంది యువతీ, యువకులను తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో తటపర్తి రాంబాబు, నేరెళ్ల హరి, ఎల్ఎస్ఆర్.ఆంజనేయులు, గుడివాడ రవీంద్ర, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ నిడమానూరు సురేష్, త్రిపురమల్లు వాణి పాల్గొన్నారు.



గుంటూరు నగరంలో సింగిల్ నంబర్ లాటరీ భూతం జడలు విప్పింది. అడ్డుఅదుపూ లేకుండా కూటమి నేతలు, అధికారుల అండదండలతో యథేచ్ఛగా సాగుతోంది. కార్మికులు, కూలీలు, పేద, మధ్యతరగతి ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని నిర్వాహకులు వారి రక్తం పీలుస్తున్నారు. పగలంతా రెక్కల కష్టం ధారపోసి సంపాదించిన నాలుగు రాళ్లను అమాయకులు జూదంలో తగలేస్తున్నారు. మాయదారి జూదంలో ఎన్నో కుటుంబాలు సమిధలు అవుతున్నాయి. కళ్ల ముందే దారుణాలు జరుగుతున్నా అధికార పార్టీ నేతలు కూడా చూసీ చూడనట్లు పోవాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేయడం బాధాకరం.

జోరుగా మాయదారి జూదం

- యథేచ్ఛగా సింగిల్ నంబర్ లాటరీ
- కూటమి నేతల కనుసన్నల్లో నిర్వహణ
- పేదలకు ఆశ చూపి.. రక్తం పీలుస్తున్న నిర్వాహకులు
- కార్మికులు, కూలీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే నిర్వహణ
- ప్రతి స్టేషన్‌కు మామూళ్లు ఇస్తున్న లాటరీ నిర్వాహకులు

పట్నంబజారు: నగరంలో సింగిల్ నంబర్ లాటరీ నిర్వహణ మళ్లీ తారస్థాయికి చేరుకుంది. చీటీలు రాసి.. కార్మికులు, కూలీనాలీ చేసుకునే ప్రాంతాల్లో అధికంగా ఆటను నిర్వహిస్తున్నారు. వీటితో పాటుగా ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా పేదలను దోచుకుంటున్నారు. చీటీలు రాసిన తరువాత.. ఆ నంబర్ తగిలితే.. సాయంత్రానికి ఆ మొత్తానికి తిరిగి ఏడింతలు తిరిగి ఇస్తారు. రూ. 100 కడితే, రూ. 800 వస్తాయి. ఈ ఆశతో కార్మికులు వారు పడ్డ కష్టాన్ని లాటరీ రూపంలో తగలేస్తున్నారు. ఒట్టి చేతులతో ఇంటికి వెళుతూ కుటుంబాన్ని పస్తులు పెడుతున్నారు.

జోరుగా టికెట్ల అమ్మకాలు

నగరంలో సింగిల్ నంబర్ లాటరీ టికెట్ అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. నంబర్ తగులుతుందనే ఆశతో వేలాది రూపాయలు పెట్టి అమాయకులు కొని మోసపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం ఆన్‌లైన్‌లోనూ సింగిల్ నంబర్ లాటరీ యాప్‌లు జోరుగా నడుస్తున్నాయి.వాటిని డౌన్‌లోడ్ చేసుకుని, అందులో పలు ప్రాంతాల నుంచి వచ్చే లింకులు ఆధారంగా ఆటలు ఆడిస్తున్నారు. చక్కా..ముక్కా, బోడోలాండ్, సూపర్ చక్కర్, మట్కా కింగ్, సూపర్ రైడర్, ది ఫాక్స్, క్యాసినో కింగ్, గ్యాంబ్లింగ్ బాబాతో పాటు అనేక రకాల యాప్‌లు ఆన్‌లైన్‌లో నడుస్తున్నాయి. వాటిల్లో కూలీలు, కార్మికులు, ఆటోవాలాలు లాటరీ తగులుతుందనే ఆశతో వేలాది రూపాయాలు వెచ్చించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. సింగిల్ నంబర్ నిర్వాహకులు మేనేజర్‌లను పెట్టుకుని మరీ స్లిప్పులు రాయిస్తున్నారు.



నల్లచెరువులో ఆటోలో కూర్చుని స్లిప్పులు రాస్తున్న సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకులు

ఒక్కొక్క నిర్వాహకుడి కింద 10 మంది మేనేజర్లు ఉంటున్నారంటే నగరంలో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

నడిరోడ్డు పైనే నిర్వహణ

నగరంలోని అనేక ప్రాంతాల్లో సింగిల్ నంబర్ లాటరీ రోడ్ల పైనే గుట్టు చప్పుడు కాకుండా సాగుతోంది. నిర్వాహకులు ఆటోల్లో కూర్చుని గుట్టుచప్పుడు కాకుండా చీటీలు కట్టిస్తున్నారు. ముఖ్యంగా పాత గుంటూరులో కూర్చుని ఉన్న గాంధీబొమ్మ సెంటర్ వద్ద, ఆర్టీసీ కాలనీ, పొన్నూరు రోడ్డులో కొంత మంది వ్యక్తులు ఆడిస్తున్నట్లు సమాచారం. దీనిపై ఇటీవలే కూటమి చెందిన ఒక కార్పొరేటర్ స్టేషన్ అధికారులతో మాట్లాడి.. నెలవారీ ఒప్పొందాన్ని కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఇదే కార్పొరేటర్ పాత గుంటూరు ప్రాంతంలో యథేచ్ఛగా పేకాట కూడా నేరుగా తానే ఆడిస్తున్నారని చెప్పుకుంటున్నారు. అతడి నుంచి సదరు స్టేషన్ అధికారి వద్ద డ్రైవర్‌గా పనిచేసే వ్యక్తి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



> **చర్యలు తీసుకుంటాం**
>
> సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకులపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే నందివెలుగు రోడ్డులోని కూర్చుని ఉన్న గాంధీబొమ్మ దగ్గర సింగిల్ లాటరీ జరుగుతున్నట్లు తెలిసింది. వెంటనే ఆపాలని సంబంధిత పాత గుంటూరు ఎస్‌హెచ్‌ఓను ఆదేశించాం. అయినప్పటికీ ఆగకపోతే చర్యలు తీసుకుంటాం. నల్లచెరువు, నెహ్రూనగర్ ప్రాంతాల్లో కూడా దృష్టి సారించి సింగిల్ నంబర్ లాటరీ ఆడే వారిపై కేసులు నమోదు చేస్తాం.
>
> –షేక్ అబ్దుల్ అజీజ్ (డీఎస్పీ, గుంటూరు ఈస్ట్)

- నల్లచెరువు ప్రాంతంలో మూడుబొమ్మల సెంటర్ వద్ద, లాలాపేట పూలకొట్ల వద్ద దందా సాగిస్తున్నట్లు చెబుతున్నారు. ఆటోల్లో కూర్చుని చీటీలు రాసి కార్మికులు ఇస్తున్న వీడియో కూడా ఇటీవల కాలంలో వైరల్‌గా మారింది. ఈ స్టేషన్ పరిధిలో మఫ్టీ, క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్ల వసూళ్లు చేస్తున్నారనే వాదనలు వినవస్తున్నాయి.
- నెహ్రూనగర్ ప్రాంతంలో కూడా సాగుతోందనే తెలుస్తోంది. ఇక్కడ స్పష్టంగా సాగుతోందని తెలిసినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదు. స్టేషన్ అధికారి పనులు చక్కబెట్టే ఇద్దరు కానిస్టేబుళ్ల వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారని తెలుస్తోంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో నిలిపి వేసిన వ్యక్తులే తిరిగి మొదలుపెట్టారనేది జగమెరిగిన సత్యం.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. ఏపీ ఎన్జీఓ మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీఓ హోంలో చైర్‌పర్సన్ వి.నిర్మల కుమారి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాసాగర్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగ సంఘం కీలకపాత్ర పోషించాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్ వినియోగంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను గుర్తించి వాటిని సవరించి, స్పష్టత కలిగించే ఉత్తర్వులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్య శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు భారంగా మారిన అనవసరమైన యాప్స్ తొలగింపు అంశంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, రాష్ట్ర మహిళా విభాగం చైర్పర్సన్ నిర్మల కుమారి, కన్వీనర్ పి.మాధవి, కోశాధికారి శివలీల, కో కన్వీనర్ వి.వి.లలితాంబ, రాష్ట్ర కార్యదర్శి బి.తులసీరత్నం, వివిధ జిల్లాల మహిళా నాయకులు పాల్గొన్నారు.

582 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 582.90 అడుగులకు చేరింది. ఇది 291.3795 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 511, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 29,151, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 93,115 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

మహనీయుడు అబ్దుల్ కలాం




అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, మోదుగుల, నూరిఫాతిమా, వనమా బాలవజ్రబాబు

పట్నంబజారు: భారతదేశం యావత్తూ గర్వించదగ్గ మహనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు కొనియాడారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం కలాం వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో జన్మించి సైంటిస్ట్‌గా ఎదిగిన గొప్ప మహనీయుడు అబ్దుల్ కలామ్ అని కీర్తించారు. అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని తెలిపారు. అద్భుతమైన కలలు కనండి.. వాటిని సాకారం చేసుకునే వరకు శ్రమించాలని యువతకు గొప్ప సందేశమిచ్చారని గుర్తు చేశారు. నేటి యువత ఆయన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. పార్టీ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ఏజీజే అబ్దుల్ కలాం భౌతికంగా లేకున్నా, 140 కోట్ల మంది ప్రజల గుండెల్లో సజీవంగా ఉన్నారని తెలిపారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. రక్షణ రంగంలో భారతదేశం రష్యా, అమెరికా, చైనా వంటి దేశాలకు దీటుగా నిలబడేందుకు అబ్దుల్ కలాం ఎంతో కృషి చేశారని వివరించారు. రాష్ట్రపతి పదవి అనంతరం గజం భూమి, బ్యాంకు బ్యాలెన్స్ లేకుండా కట్టుబట్టలు మాత్రమే ఉన్న మహోన్నతమైన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది కలాం మాత్రమేనని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ యుద్ధాల్లో భారత్ విజయం సాధిస్తుందంటే అబ్దుల్‌కలాం కృషి ఎంతగానో ఉందని చెప్పారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఆరాధించే గొప్ప మేధావి అబ్దుల్ కలాం అని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ హార్డ్ వర్క్, ఎడ్యుకేషన్, డ్రీమ్ అంశాల ద్వారా అభివృద్ధి సాధ్యపడుతుందని చాటిచెప్పిన మహనీయుడు అబ్దుల్‌కలామ్ అని వివరించారు. ఆయన లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించారని, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు తెచ్చుకున్నారంటే, దాని వెనుక ఆయన కృషి స్పష్టంగా తెలుస్తుందని తెలిపారు. తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్‌వలి, షేక్ గులాం రసూల్, మెట్టు వెంకటప్పారెడ్డి, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ జిల్లా, నగర కమిటీ నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తతతో డెంగీకి చెక్

- జిల్లాలో 50 కేసులు నమోదు
- అపోహలతో ప్రాణాలు పోయే ప్రమాదం
- కొద్ది జాగ్రత్తలతో జ్వరానికి అడ్డుకట్ట
- డెంగీ పేరుతో ప్రైవేటు వైద్యుల దోపిడీ



జిల్లాలో బాధితులు.

సంవత్సరం	బాధితుల సంఖ్య
2021	447
2022	168
2023	375
2024	432
2025	50 (జూన్ వరకు)

గుంటూరు మెడికల్: డెంగీ జ్వరం... ఈ మాట వినగానే జిల్లా ప్రజల్లో వణుకు పుడుతుంది. గతంలో అధికంగా కేసులు జిల్లాలోనే నమోదవ్వడంతో హెల్త్ ఎమర్జన్సీ సైతం ప్రకటించారు. డెంగీ జ్వరంతో మరణాలు కూడా సంభవించాయి. సాధారణంగా కొన్ని జ్వరాలు వచ్చిన కొద్దిరోజుల్లోనే తగ్గిపోతాయి. కొన్ని సరైన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో ప్రాణాలు సైతం పోయే ప్రమాదం ఉంది. సాధారణంగా వర్షాలు కురిసే సమయంలో జ్వరాలు వస్తుంటాయి. కాని మండుటెండల్లోనూ కేసులు నమోదవ్వడంతో ప్రజల్లో ఆందోళన ప్రారంభమైంది. ముఖ్యంగా సరైన అవగాహన లేకపోవడంతో పలువురు ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ పేరిట జ్వర బాధితుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. డెంగీపై కొద్దిపాటి అవగాహనతో జాగ్రత్తలు తీసుకుంటే దాని బారిన పడకుండా ఉండొచ్చు.

డెంగీ జ్వరం లక్షణాలు

పగటి పూట కుట్టే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు వల్ల డెంగీ జ్వరం వస్తుంది. వాంతులు, తలనొప్పి, కంటి గుడ్డు కదిలినప్పుడు నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతి అయినట్లు భ్రాంతి కల్గడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ఒంటిపై ఎర్రటి గుల్లలు ఏర్పడతాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ఒక్కోసారి రక్తస్రావం జరుగుతుంది. ఎలీసా పద్ధతిలో రక్త పరీక్ష చేసి వ్యాధిని నిర్ధారణ చేస్తారు.

అపోహలతో ప్రాణాల మీదకు..

డెంగీపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ పేరిట రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. కొంత మంది బొప్పాయి రసం తాగితే, బొప్పాయి తింటే ప్లేట్‌లెట్స్ పెరుగుతాయనే అపోహల్లో ఉంటున్నారు. దీంతో ఆస్పత్రులకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. డెంగీపై అవగాహనతో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే జ్వరం బారిన పడకుండా ఉండొచ్చు.

పట్టణాల్లో కేసులు అధికం

గ్రామీణ ప్రాంతాల్లో కంటే మున్సిపాలిటీలు, గుంటూరు కార్పొరేషన్ పరిధిలోనే ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. ఈ ఏడాది గుంటూరు నగరంలో 31 కేసులు నమోదయ్యాయి. నగరంలోని భాగ్యనగర్, బొంగరాలబీడు , బృందావన్ గార్డెన్స్, గోరంట్ల, కోబాల్ట్‌పేట, గుండారావుపేట, గుంటూరువారితోట, శారదాకాలనీ, ఆర్. అగ్రహారం, వసంతరాయపురం, శ్రీనివాసరావుతోట, పాత గుంటూరు, ఎన్‌జీఓ కాలనీ, మంగళదాస్‌నగర్, లాంచెస్టర్‌రోడ్, ఐపీడీ కాలనీ, గుంటూరువారితోట, లాలాపేట, తదితర ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి.

దోమలు పెరిగే ప్రదేశాలు

మంచినీటిని నిల్వ చేసే ప్రదేశంలో, వాడి పారేసిన వస్తువులు, నిలువ ఉండే నీటిలో దోమ పిల్లలు పురుగుల మాదిరి కదులుతూ ఉంటాయి. నీటిని నిల్వచేసే డ్రమ్ములు, తొట్టెలు, గాబులు, రుబ్బురోళ్లు, టైర్లు, టీ కప్పులు, ప్లాస్టిక్ కప్పులు, కొబ్బరి చిప్పలు, బొండాలు, ఫ్రిజ్, ఎయిర్ కూలర్స్ వెనుక భాగాల్లో, పూల కుండీలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి సంపుల్లో దోమ లార్వాలు పెరుగుతాయి.



ప్లేట్‌లెట్స్‌పై అపోహలు వీడండి



ఎలాంటి జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్ తగ్గటం సహజం. అంతమాత్రానికే ఊరికే రోగులు కంగారు పడకూడదు. సాధారణంగా రక్తంలో 2 లక్షల నుంచి 4.5 లక్షల ప్లేట్‌లెట్స్ ఉంటాయి. వీటి సంఖ్య 40 వేల కన్నా తక్కువగా ఉన్నప్పటికీ ప్రమాదం లేదు. డెంగీ మొదటి దశలో జ్వరం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, తలనొప్పి, కళ్లు ఎర్రగా మారతాయి. రెండో దశలో ప్లేట్‌లెట్స్ తగ్గటం, జ్వరం, వాంతులు, కాళ్ల వాపులు వస్తాయి. మూడో దశలో బీపీ తక్కువగా ఉండటం, ప్లేట్‌లెట్స్ తగ్గటం, శరీరంపై మచ్చలు ఏర్పడతాయి. నాలుగో దశలో రోగికి కామెర్లుతో పాటుగా షాక్‌లోకి వెళతాడు. బీపీ తగ్గడంతో పాటు కిడ్నీల పనితీరు తగ్గిపోయి, శరీరంపై ఎర్రటి దద్దుర్లు ఏర్పడతాయి. అవి పగిలి వాటి ద్వారా రక్తం బయటకు వస్తుంది. మూత్రంలో, దగ్గుతున్నప్పుడు కళ్లె ద్వారా రక్తం పడిపోతూ ఉంటే అప్పుడు ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి ఉంటుంది. నాలుగో దశను డెంగీ హెమరేజ్ షాక్ సిండ్రోమ్ అంటారు. మొదటి మూడు దశల్లో ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన పనిలేదు.

– డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి, జ్వరాల స్పెషలిస్ట్, గుంటూరు.

ఉచితంగా వైద్యపరీక్షలు



జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు కిట్ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నాం. ప్రైవేటు వైద్యులందరికీ కేసులు నిర్ధారణ జరిగితే సమాచారం ఇవ్వాలని, ప్లేట్‌లెట్స్ పేరుతో భయపెట్టవద్దని ఆదేశాలు జారీ చేశాం. ప్రతిరోజూ వైద్య సిబ్బందిని ప్రైవేటు ఆస్పత్రులకు పంపించి వివరాలు సేకరిస్తున్నాం. దోమల నివారణ చర్యల్లో భాగంగా గంబూషియా చేప పిల్లలను నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో వదిలాం. కేసులు నమోదైన ప్రాంతంలో యాంటీలార్వా పద్ధతులు, ఫాగింగ్ చేస్తున్నాం. దోమల పెరుగుదలకు అపరిశుభ్రమైన వాతావరణమే ముఖ్య కారణం. దీన్ని దృష్టిలో పెట్టుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మురుగు, వర్షపునీరు నిల్వలేకుండా చూసుకోవాలి. దోమల నుంచి రక్షణకు ఉదయం, సాయంత్రం సమయాల్లో తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. నిద్రించే సమయంలో తప్పనిసరిగా దోమ తెరలు వాడటం చాలా మంచిది.

–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి, గుంటూరు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన కేరళ బృందం

కొల్లిపర: రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో కేరళకు చెందిన బృందం కొల్లిపర మండల పరిధిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆదివారం సందర్శించింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలో భాగంగా గుంటూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కొల్లిపర మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పంట పొలాల్లో క్షేత్ర సందర్శన ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయంలోని సార్వత్రిక సూత్రాలను జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి, సీనియర్ కన్సల్టెంట్ రామచంద్ర కేరళ బృందానికి వివరించారు.

- మహిళా రైతు వసంత పొలంలోని అరటి ఏ-గ్రేడ్ మోడల్, ఎనీ టైం మనీ మోడల్‌ను బృందం సందర్శించింది. ఏటీఎం మోడల్ సాగు విధానం, ఉపయోగాలు వివరించారు. బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం తయారీ, విత్తన ద్రువీకరణ తదితర అంశాలను రైతులు కేరళ బృందం సభ్యులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రత్యక్షంగా తయారు చేసి చూపించారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయ క్షేత్రాలలో బ్రిక్స్ విలువలను బృందం పరిశీలించింది. ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఉష్ణోగ్రత 31%గాను, రసాయన వ్యవసాయ క్షేత్రంలో 36%గాను నమోదైనట్లు తెలుసుకున్నారు.



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కేరళ బృందం

- మహిళా రైతు మాణిక్యమ్మకు చెందిన పొలంలో ఏ-గ్రేడ్ మోడల్ పంటల్లో అరటి, కంద, కంది, పసుపు, బయోడైవర్సిటీ క్రాప్స్‌ను కేరళ బృందం సందర్శించింది. వారు అడిగిన పలు ప్రశ్నలకు ప్రయోగాత్మకంగా అధికారులు సమాధానమిచ్చారు.
- అనంతరం శ్రీలక్ష్మి అనే మహిళా రైతుకు చెందిన పొలంలో సూర్య మండల మోడల్‌ను సందర్శించారు. ఇందులో రోజూ ఒక్కొక్క రకమైన కూరగాయలు వచ్చే విధంగా పంటలు వేసుకున్నట్లు ఆమె వివరించారు.
- అన్నవరంలో రైతు సాంబయ్య పీఎండీఎస్ క్షేత్రాన్ని సందర్శించి, ప్రాధాన్యతను తెలుసుకున్నారు.
- బొమ్మువారిపాలెంలో ఉన్న బయో రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించారు. ఇక్కడ లిక్విడ్ పొటాషియం తయారు చేసుకునే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. చివరగా మహిళా సంఘాల గ్రూపుతో ప్రకృతి వ్యవసాయ భాగస్వామ్యం గురించి చర్చించారు. కేరళ బృంద సభ్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సరోజ్ కుమార్ కృషి, విజ్ఞాన కేంద్రం కొల్లం, ఎఫ్ఎంటీ జాకబ్ థామస్, ఎఫ్ఎంటీ ఒమన్ కుమార్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

- తాడికొండలో ఘటన
- చిలికి చిలికి ముదిరిన వివాదం
- రెండు సామాజిక వర్గాల యువకులు భారీగా మోహరింపు
- వైన్స్ వద్ద నిత్యం వివాదాలు

తాడికొండ: మద్యం మత్తులో రెండు సామాజిక వర్గాలకు చెందిన యువకులు పరస్పర దాడులకు దిగారు. ఇందులో ఒక యువకుడికి తల పగిలిన ఘటన తాడికొండలో ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం.. తాడికొండ శివారు పెదపరిమి రోడ్డులోని వైన్స్ దుకాణం వద్ద మద్యం తాగిన ముస్లిం యువకులు, పక్కనే ఉన్న దుకాణం వద్దకు వెళ్లి బూతులు మాట్లాడుకుంటుండగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకులు వారించారు. దీంతో వివాదం చెలరేగి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇది కాస్తా పెద్దదిగా మారింది. ముస్లిం యువకులు గాంధీబొమ్మ సెంటర్ వద్ద అటుగా వస్తున్న యువకులను టార్గెట్ చేసి వివాదానికి దిగడంతో, గొడవ పెద్దదిగా మారింది. వివాదానికి సంబంధం లేని నూతక్కి సాగర్‌బాబు అటుగా వస్తూ ఆగి చూస్తుండగా రాడ్డుతో తలపై కొట్టడంతో పగిలి రక్తస్రావమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. బాధితుడిని వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఘటన స్థలంలో సీసీ పుటేజీలను సీఐ కె. వాసు పరిశీలించారు. దీనిపై ఇప్పటి వరకు స్టేషన్‌కు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ కె. వాసు తెలిపారు.



గాయపడిన సాగర్ బాబు



తాడికొండ ప్రధాన రహదారిపై గాంధీబొమ్మ సెంటర్‌లో భారీగా మోహరించిన యువకులు



పెదపరిమి రోడ్డులో గల వైన్స్‌లో మద్యం తాగుతున్న యువకులు

బార్ అండ్ రెస్టారెంట్‌లను తలపిస్తున్న దుకాణాలు

తాడికొండ, తుళ్లూరు మండలాల్లో వైన్స్ దుకాణాలు బార్ అండ్ రెస్టారెంట్లను తలపిస్తున్నాయి. పర్మిట్ రూంకు అవకాశం లేనప్పటికీ నిర్వాహకులు షెడ్డులలో సిట్టింగ్‌కు అనుకూలంగా బల్లలు ఏర్పాటు చేసి, నిత్యం తాగుబోతులకు నిలయంగా మారుస్తున్నారు. అక్కడే వాటర్, సోడాలు, టచ్చింగ్, చికెన్ పకోడీ సహా అమ్మకాలు చేస్తుండటంతో వైన్స్ దుకాణాలు నిత్యం తాగుబోతులతో కిటకిటలాడుతున్నాయి. తుళ్లూరులో వైన్స్ దుకాణం రాజధాని నిర్మాణ కార్మికులతో కళకళలాడుతోంది. నిత్యం వందలాది మంది కార్మికులు కూర్చొని తాగేందుకు వీలుగా బెంచీలు, పెద్ద షెడ్డును దుకాణదారులు ఏర్పాటు చేశారు. రాత్రిపూట కూడా వ్యక్తులను ఏర్పాటు చేసి, అదనంగా ధరలు వసూలు చేస్తూ 24 గంటల అమ్మకాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు నామమాత్రపు దాడులు మినహా తొంగిచూసిన దాఖలాలు లేవు. దీంతో నిత్యం వివాదాలకు నిలయంగా వైన్స్ దుకాణాలు మారుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వైన్స్ దుకాణాల వద్ద తాగుబోతుల వీరంగానికి కళ్లెం పడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర విధులు తగదు

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి తప్పించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు కోరారు. ఎస్టీయూ ప్రాంతీయ శాఖ సమావేశం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ఉపాధ్యాయులను యాప్‌ల ద్వారా అనేక రకాల సమాచారం అందించాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడం తగదన్నారు. బియ్యం, సరుకులు, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు వంటివి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి తెచ్చుకోవడం వంటి పనుల నుంచి మినహాయించాలన్నారు. ప్రతి ఒక్క పనిని అత్యవసరం అంటూ వేధించటం తగదని, సర్వర్ పనిచేయకపోవడంతో మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్‌కు సంబంధించిన ఫొటోలు ఇప్పటికీ అప్‌లోడ్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు నాలుగు నుంచి ఎఫ్ఏ -1 పరీక్షలు ఉన్నందున సిలబస్ పూర్తి చేయాల్సిన సమయంలో యాప్‌ల భారంతో ఉపాధ్యాయులు సతమతం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు బి.అక్కయ్య, ఎం.కోటేశ్వరరావు, వి.జయప్రకాశ్, మగ్బూల్‌బాష, దుర్గా ప్రసాద్, కోటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తైక్వాండో పోటీల్లో 15 మందికి బంగారు పతకాలు



తెనాలి అర్బన్: గుంటూరు జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తెనాలి కేఎస్‌ఆర్ అకాడమి విద్యార్థులు 15 మందికి బంగారు, ఆరుగురికి వెండి, ఇద్దరికి కాంస్య పతకాలు లభించినట్లు కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. పోటీలను రేపల్లెలో ఈ నెల 19,20 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. వీరందరూ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు వివరించారు. ఆదివారం అకాడమి ఆవరణలో క్రీడాకారులకు పతకాలు పంపిణీ చేసి అభినందించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు ఈదర వెంకట పూర్ణచంద్, వీరవల్లి మురళి, కుర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడాకారిణి జెస్సీ రాజ్‌కు మంత్రి అభినందనలు

తాడేపల్లి రూరల్: మంగళగిరికి చెందిన యువ స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీ రాజ్‌కు ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఉండవల్లిలోని ఆయన కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దక్షిణ కొరియాలో జరుగుతున్న ఏషియన్ రోలర్ స్కేటింగ్ సోలో డ్యాన్స్ సబ్ జూనియర్ విభాగంలో జెస్సీ రాజ్ సిల్వర్ మెడల్ సాధించినందుకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికపై భారత జెండాను రెపరెపలాడించి, భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన ఆమె భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించినట్లు ప్రకటనలో వారు పేర్కొన్నారు.

టైప్‌రైటింగ్ పరీక్షలకు 54 మంది హాజరు

రేపల్లె: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ మంగళగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైప్‌రైటింగ్ పరీక్షలు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఇంగ్లీష్ లోయర్‌కు 30 మంది, హయ్యర్ పరీక్షకు 15 మంది, జూనియర్ గ్రేడ్‌కు ఏడుగురు, తెలుగు హయ్యర్‌కు ఒకరు, లోయర్‌కు ఒకరు చొప్పున మొత్తం 54 మంది హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

జిల్లా ఫ్లోర్ బాల్ ఎంపిక పోటీలు



వినుకొండ: పల్నాడు జిల్లా ఫ్లోర్‌బాల్ అండర్ -14, 19 బాలబాలికల ఎంపిక పోటీలు పట్టణంలోని లయోలా పాఠశాలలో నిర్వహించినట్లు పల్నాడు జిల్లా ఫ్లోర్ బాల్ ప్రధాన కార్యదర్శి ఎం.కిషోర్‌బాబు తెలిపారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 3న నరసరావుపేటలోని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో లయోలా స్కూల్ హెచ్‌ఎం అభినాష్, జిల్లా కార్యదర్శి కిషోర్, పీఈటీలు ఏడుకొండలు, కోటేశ్వరమ్మ, రవితేజ, వివిధ పాఠశాలల నుండి 100మంది బాలబాలికలు పాల్గొన్నారు.

పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.బాబురావు
- స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పాతగుంటూరులో ప్రచారం

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన నారా లోకేష్ టీడీపీ కూటమి సర్కారు గతంలో అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు ప్రశ్నించారు. గుంటూరు నగరంలోని పాతగుంటూరు బాలాజీనగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో అదానీ స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఆదివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా వ్యతిరేకించిన టీడీపీ నేడు అధికారంలోకి వచ్చి స్మార్ట్ మీటర్లు వేగంగా ఏర్పాటు చేస్తూ ప్రజలపై భారాలు మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని పేర్కొన్నారు. ఇప్పటికే ట్రూ అప్, సర్దుబాటు చార్జీలతో విసిగిపోయిన ప్రజలు అదానీ ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారని వెల్లడించారు. వామపక్షాల ఆధ్వర్యంలో ఆగస్టు 7వ తేదీన జరిగే పోరాటంలోనూ ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కె నళినీకాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు లక్కా అరుణ, బి ముత్యాలరావు, యం ఎ చిష్టీ, నగర కార్యదర్శివర్గ సభ్యులు కె శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశిం షహీద్, ఎ కళ్యాణి, షేక్ అబ్దుల్ సలీమ్, పాత గుంటూరు శాఖ కార్యదర్శి కార్తీక్, సభ్యులు కె గంగాధరరావు, కె సుధీర్, జె నాంచారయ్య, ఆది నికల్సన్, ఫణీంద్ర కుమార్, కె సునీత తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లుల గురించి మాట్లాడుతున్న బాబూరావు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆగస్టు 5న ధర్నా

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

బాపట్ల: ప్రభుత్వ భూములను బడా కంపెనీలకు కట్టబెట్టే పనిలో కూటమి ప్రభుత్వం ఉందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి అన్నారు. ఆదివారం బాపట్లలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. రమాదేవి మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా వచ్చే నెల 5న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నల్లబర్లీ పొగాకు కొనుగోలులో పేద రైతు కౌలు రైతులకు ప్రాధాన్యత ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది కూటమి ప్రభుత్వ పని తీరును పరిశీలిస్తే మంత్రులు దగ్గర నుంచి ఎమ్మెల్యేల వరకు ప్రజలకు అందుబాటులో లేకుండాపోయారని విమర్శించారు. ప్రభుత్వంలోని ప్రతి స్థాయిలో అవినీతి అడుగడుగునా రాజ్యమేలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక చర్యలు, పెరిగిన ధరలు, విద్యుత్ చార్జీల మోత, స్మార్ట్‌మీటర్ల ప్రమాదం వంటి సమస్యలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆండ్రా మాల్యాద్రి, పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, టి కృష్ణమోహన్, సీహెచ్ మజుందర్, ఎన్ బాబురావు, సీహెచ్ మణిలాల్, కొండయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్ విశ్రాంత ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బుచ్చిరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: పంచాయతీరాజ్ విశ్రాంత ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంటు అండ్ ఇంజినీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎంబీ బుచ్చిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. బుచ్చిరాజు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలోని విశ్రాంత ఉద్యోగులు, ఇంజినీరింగ్ అధికారుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది పంచాయతీరాజ్ విశ్రాంత ఉద్యోగులు, ఇంజనీర్లు పెన్షన్, మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ వంటి అంశాల్లో వేతన విభజన చట్టాల ముసుగులో జరుగుతున్న వర్గీకరణ కారణంగా ఇబ్బందులు పడుతూ, నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ దారుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి గానూ అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య పిలుపుతో ప్రధానికి ఒక వినతి పత్రాన్ని పంపనున్నట్లు తెలిపారు. రిటైర్డ్ పంచాయతీరాజ్ ఉద్యోగుల ఇంజినీర్ల వేతన సవరణ, బకాయిలు, డీఏలు, మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ వంటి అంశాల్లో అన్యాయం జరుగుతోందని వివరించారు. 12వ వేతన సవరణ పూర్తి స్థాయిలోఅమలు చేయడంతో పాటు 35 శాతం ఐఆర్ మంజూరు చేయాలని ఆయన కోరారు. 12వ పీఆర్సీలో చట్టబద్ధత కల్పించి, 11 పీఆర్సీలో అమలు చేసిన విధంగా అదనపు పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జీవో 315ను సవరించి, భార్యాభర్తలకు కుటుంబ పెన్షన్ వర్తించేలా మార్పులు చేయాలని సూచించారు. యూజీసీ స్కేల్స్ పరిధిలోకి వచ్చే పెన్షన్‌దారులకు అదనపు పింఛన్, 10వ పీఆర్సీ తరహాలో రిఫండ్ డెత్ రిలీఫ్ అమలు పర్చాలని కోరారు. పీఆర్సీ, డీఏ బకాయిలతో పాటు ఉద్యోగుల హెల్త్ స్కీం క్లెయిమ్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ పూర్తిగా ఈహెచ్‌ఎస్ కింద చెల్లించాలని, ఆరోగ్య బీమా కార్డులను పరిమితులు లేకుండా అందరికీ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డైరెక్టరేట్ వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు అమరావతిలో భవనం నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారానికి మంత్రులతో పాటు ఉన్నతాధికారులను కలుస్తామని తెలిపారు. సమావేశంలో సంఘ అసోసియేట్ ప్రెసిడెంట్ షేక్ రియాజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి యు.కూర్మారావు, కోశాధికారి బి.శివరామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసరావు, ఎం.వి.రంగాచారి, వి.వెంకటేశ్వరరావు, 13 జిల్లాల కార్యవర్గ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, రాష్ట్ర సంఘ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుచ్చిరాజు

కలిసికట్టుగా సమస్యలపై పోరాటం

అద్దంకి: నూర్‌బాషాలందరూ కలిసికట్టుగా ఉంటే సమస్యలపై పోరాటంతో విజయాలు సాధించవచ్చని రాష్ట్ర నూర్ బాషా యువజన సంఘం అధ్యక్షుడు దూదేకుల పెద మస్తాన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని షాదీఖానాలో సమావేశం నిర్వహించారు. పట్టణ నూర్ బాషా దూదేకుల కమిటీ అధ్యక్షుడిగా షేక్ మదీనాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో మస్తాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూర్ బాషా దూదేకుల ఆర్థిక సంస్థ ఏర్పాటు చేయడం సంతోషమని చెప్పారు. రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ దూదేకుల దావూద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మనకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. పిల్లలకు సర్టిఫికెట్‌లో లోపాలు జరుగుతున్నాయని వివరించారు.

వేతనాలు అందక ఉపాధ్యాయులకు అవస్థలు

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కోర్టు వద్ద ఉన్న సంఘ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీ-అపోర్షన్మెంట్ గురైన ఉపాధ్యాయులతో పాటు అప్ గ్రేడ్, డీ-గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల్లోని వేలాది మంది ఉపాధ్యాయులకు మే, జూన్ నెలలకు సంబంధించిన వేతనాలు అందని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఫలితంగా బ్యాంకు, వ్యక్తిగత రుణ చెల్లింపులు, కుటుంబ ఖర్చులు భారంగా మారాయని పేర్కొన్నారు. విధులకు డెడ్‌లైన్ విధించి, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్న విద్యాశాఖాధికారులు వేతనాల చెల్లింపుల్లో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆగస్టు మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఉపాధ్యాయ ఖాళీల్లో డీఎస్సీ నియామకాలు చేపట్టే వరకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కోరారు. ఇంటర్మీడియట్ తరగతులు బోధిస్తున్న ప్లస్ టూ పాఠశాలల్లోని సబ్జెక్ట్ టీచర్స్ ఖాళీల్లో పీజీ అర్హత గల ఉపాధ్యాయులను తాత్కాలికంగా నియమించి, విద్యా ప్రమాణాలు పడిపోకుండా చూడాలని తెలిపారు. గతంతో పోలిస్తే యాప్స్ భారం పెరిగిందని, తక్షణమే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కటీ ఆన్‌లైన్‌లో నమోదు చేయమంటూ, ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం తగదని ఖండించారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించి, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ బకాయిలు రూ.25వేల కోట్ల మేరకు పేరుకుపోయాయని, మూడేళ్లుగా చెల్లింపులు లేక సరెండర్ లీవ్ బిల్స్ మూలన పడ్డాయని తెలిపారు. తక్షణమే ఆయా బకాయిలను చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హత గల ఎస్జీటీ, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఎంఈవోల బదిలీలు చేపట్టి, కామన్ సర్వీస్ రూల్స్ ప్రకారం ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాడు-నేడు పనులను పూర్తి చేయాలని కోరారు. పలు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లు సరిపడా విద్యార్థులకు అందలేదని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు జి.దాస్, ఎస్.ఎస్.ఎన్ మూర్తి, బి.సాయి లక్ష్మి, పి.నాగశివన్నారాయణ, జిల్లా కౌన్సిలర్లు గురుమూర్తి, ముని నాయక్, షేక్ షూకూర్, సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బసవ లింగారావు

ఆట్యా- పాట్యా జిల్లా జట్టు ఎంపిక

నకరికల్లు: పల్నాడు జిల్లా ఆట్యా-పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని పలు ఉన్నతపాఠశాలల నుంచి క్రీడాకారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. న్యాయనిర్ణేతలు 15 మంది బాలికల, 15 మంది బాలురను పల్నాడు జిల్లా జట్టులో ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాణించి రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటాలని ఆట్యా-పాట్యా అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు చింతా సామ్రాజ్యం అన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఆగస్ట్ 9, 10వ తేదీలలో ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కాసా మల్లికార్జునరావు, ఫిజికల్ డైరెక్టర్‌లు చింతా పుల్లయ్య, జి.ఝాన్సీరాణి, తిరుమల బాయి, పి.తిరుపతిరావు, పెద్ద వెంకటేశ్వర్లు, అశోక్, పి.ఆంజనేయులు, షేక్.నాగూర్‌వలి, దరియావలి, వెంకటరమణ పాల్గొన్నారు.

బాలికల జట్టులో..
బి.సౌజన్య(వాగ్దేవి జూనియర్ కాలేజ్, నరసరావుపేట), షేక్ నజ్మ(వాగ్దేవి జూనియర్ కాలేజ్, నరసరావుపేట), షేక్ సుహానా మస్తాని(శ్రీ చైతన్య కళాశాల), కె.వైష్ణవి(జెడ్పీ హెచ్ఎస్, ఎస్.బి.పురం), డి.రంగ మహాలక్ష్మి(జెడ్పీ హెచ్ఎస్, నకరికల్లు), సీహెచ్ విజయ(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), ఎం.స్నేహ(శ్రీచైతన్య), ఎం.దివ్యసన్నిధి(జెడ్పీహెచ్ఎస్, కావూరు), షేక్.జి.సాధిక(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), టి.లిఖిత(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), బి.మేఘన(ఏపీ మోడల్‌స్కూల్, దేచవరం), కె.బుజ్జి(ఏపీ మోడల్‌కాలేజ్, దేచవరం), బి.ప్రమీల(జెడ్పీహెచ్ఎస్, కావూరు), పి.దీక్షిత(సింధూ స్కూల్), బి.స్వాతి ప్రియ(సింధూ స్కూల్) ఎంపికయ్యారు.

బాలుర జట్టులో..
షేక్ ఇస్మాయిల్(ఏపీ మోడల్ స్కూల్, దేచవరం), పి.వరప్రసాద్(జెడ్పీహెచ్ఎస్, ఎస్.బి.పురం), ఎం.వి.సాయిప్రదీప్(ఆక్స్‌ఫర్డ్ విట్, నరసరావుపేట), కె.శ్రీనివాస్(వాగ్దేవి జూనియర్ కళాశాల, నరసరావుపేట), టి.మణిదీప్(జెడ్పీహెచ్ఎస్, ఎస్.బి.పురం), షేక్ జాన్‌సైదా(ఆక్స్‌ఫర్డ్ విట్, నరసరావుపేట), ఆర్.లక్ష్మీనారాయణ(తిరుమల ఆక్స్‌ఫర్డ్), జి.లక్ష్మీప్రశాంత్(జెడ్పీహెచ్ఎస్, ఎస్.బి.పురం), ఎస్.సాయి తేజ(ఆక్స్‌ఫర్డ్ విట్), బి.మణికంఠ(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), షేక్ నబీర సూల్(జడ్పీహెచ్ఎస్,నకరికల్లు), డి.కోటేశ్వరరావు(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), వై.అఖిల్(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), డి.శ్రీవెంకట అతులిత్(సింధూ స్కూల్), డి.ప్రసూన్(జెడ్పీహెచ్ఎస్, కావూరు) ఎంపికయ్యారు. ప్రతి జట్టులోను అదనంగా స్టాండ్‌బైలో ఐదుగురు చొప్పున ఎంపిక చేశారు.



పల్నాడు జిల్లా ఆట్యా-పాట్యా జట్టుకు ఎంపిక క్రీడాకారులు

బుల్లెట్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు



యడ్లపాడు: జాతీయ రహదారిపై తిమ్మాపురం వద్ద బైపాస్ రహదారిపై ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల తెలిపిన వివరాలు.. మేడికొండూరు మండలం పాలడుగుకు చెందిన దొప్పలపూడి హనుమానా శాస్త్రి, దండా గోపి, మరొక వ్యక్తి కలిసి బుల్లెట్‌పై చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు ఆదివారం వెళ్తున్నారు. తిమ్మాపురం వంతెన పైనా మలుపు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బుల్లెట్‌పై ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వాహనం కూడా ధ్వంసమైంది. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని 108లో గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలోని సీసీ కెమెరా పుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. వాహనంపై కూర్చున్న వారిలో మధ్యలో ఉన్న వ్యక్తి బుల్లెట్ హ్యాండిల్ పట్టుకున్నట్లుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

టీడీపీ నుంచి మొగల్ జాన్‌ను సస్పెండ్ చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య
- దొడ్లేరులో ప్రదర్శన, రాస్తారోకో

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో రైతులు నష్టపోయిన బంగారాన్ని ఇప్పించాలంటూ రైతుల పక్షాన పోరాటం చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకుడు హనుమంతరావుపై దాడి చేయటాన్ని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి కృష్ణయ్య ఖండించారు. అధికార పార్టీకి చెందిన క్రోసూరు మండల అధ్యక్షుడు మొగల్ జాన్ దాడి చేయటం అధికార తెలుగుదేశం ప్రభుత్వం రైతుల పక్షాన పనిచేస్తుందా లేక దొంగల పక్షాన పనిచేస్తుందా? అని ప్రశ్నించారు. అటువంటి వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులపై దాడులు చేస్తే వెన్నుచూపరని సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరంతర పోరాటం సాగిస్తారన్నారు. ఆదివారం దొడ్లేరు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ దొడ్లేరు గ్రామస్తులు అనంతవరం మీదగా క్రోసూరు వెళ్లడానికి, అవులవారిపాలెం మీదుగా బెల్లంకొండ వెళ్లడానికి పలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పునరుద్ధరించాలని ఆర్ అండ్ బీ అధికారులను కలిసి గ్రామ ప్రజల సమస్యలను విన్నవించామన్నారు. అంతేకాకుండా సాగర్ కాలవ నీళ్ల చివరి ఆయకట్టు రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌలు రైతులకు షరతులు లేకుండా రుణాలు కల్పించాలని, అన్నదాత సుఖీభవ నిధులు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వై రాధాకృష్ణ, వై గోపాలరావు గద్దె చలమయ్య, ఆంజనేయులు నాయక్, జి మల్లేశ్వరి, డి విమల. పి మహేష్, అచ్చంపేట క్రోసూరు మండలాల రైతు సంఘం నాయకులు, హనుమంతరావు అవుల ఆంజనేయులు, ఆర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



దొడ్లేరులో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య